
సాక్షి
మెదక్
శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



అందరికీ న్యాయం చేయండి
బీఆర్‌ఏలలో అసలుదారులకు ఒక్కరికే రెగ్యులర్ చేయడంతో ఈసాదారులం రోడ్డు పడుతామని. అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ రాజర్షిషాను బీఆర్‌ఏలు కోరారు. 8లో



ఆరోగ్యవంతులతోనే సమాజాభివృద్ధి
విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధిలో పయనిస్తోందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో



ఈ దారుల్లో వెళ్లేదెలా ?
పీడబ్ల్యూడీ రోడ్డును కలుపుతూ రంగంపేట మీదుగా కోనాపూర్ వెళ్లే దారిని మరమ్మతుల కోసం నెల రోజుల క్రితం తవ్వి వదిలేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 9లో

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణ

మెదక్ కలెక్టరేట్: పలు గ్రూపు పరీక్షలకు సిద్ధమవుతున్న 100 మంది అభ్యర్థులకు మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మైనార్టీ వెల్ఫేర్ అధికారి జెమ్లానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్టడీ సెంటర్‌లో మహిళా అభ్యర్థులకు 33శాతం, వికలాంగులకు 3శాతం సీట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులకు 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

కేసీఆర్ రైతుబాంధవుడు

జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత తదితరులు

మనోహరాబాద్ (తూప్రాన్): రైతులకు రుణమాఫీ చేసి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బాంధవుడు అయ్యారని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత అన్నారు. గురువారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రుణమాఫీ వల్ల రైతు కుటుంబాలకు ఎంతో మేలు కలుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు నాగిరెడ్డి, రమేష్ గౌడ్, లక్ష్మీనర్సింలుగౌడ్, మోంగాయనాయక్, ఇర్ఫాన్, రతన్‌లాల్, ఉదయ్‌రంజన్‌గౌడ్, ఉప సర్పంచ్‌లు మహేందర్‌గౌడ్, రేణుకుమార్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శైలేందర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు సుధాకర్, నాగయ్య, తదితరులు ఉన్నారు.

12న చలో హైదరాబాద్ విజయవంతం చేయండి

సీపీఎస్ ఉద్యోగ సంఘం నేత దేవయ్య



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న దేవయ్య

చిన్నశంకరంపేట (మెదక్): సీపీఎస్ పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ ఈ నెల 12న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడు దేవయ్య కోరారు. గురువారం చిన్నశంకరంపేటలో ఉపాధ్యాయ ఉద్యోగులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులతో పాటు లక్షా ముప్పై వేల మంది ఓపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల కుటుంబాలకు న్యాయం చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: హైదరాబాద్(రుద్రారం) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను బీఏ, ఎంఏ కోర్సులలో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుందని విశ్వవిద్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించాయి. బీఏ(ఎకనామిక్స్, ఇంగ్లీషు, హిస్టరీ, మాస్ కమ్యూనికేషన్, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, విజువల్ కమ్యూనికేషన్, డ్యాన్స్ (భరతనాట్యం, కూచిపూడి/మోహినీయాట్టం), ఎంఏ (అప్లయ్డ్ సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషు) కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 50 శాతం మార్కుల సగటుతో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు గీతం ప్రవేశ పరీక్ష ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. వివరాల కోసం 08455-221396, www.fitam.edu వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వెల్మకన్న విద్యార్థి



కొడిపల్లి : పీఈటీతో విద్యార్థి సీహెచ్ సురేష్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్.సురేష్ జావెలిన్‌త్రో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు హెచ్‌ఎం సరోజ, పీఈటీ ఇప్ప రాజేందర్ గురువారం తెలిపారు. మెదక్‌లో నిర్వహించిన అండర్–14 జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో ఈనెల 7న వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా నవీన్‌గుప్త, రాజేందర్ విద్యార్థిని అభినందించారు.

రూ. 217.84 కోట్లు మాఫీ!

రూ.లక్ష రుణం మాఫీకి లైన్ క్లియర్
- జిల్లాలో 25,318 మంది రైతులకు లబ్ధి
- సీఎం ప్రకటనతో సర్వత్రా హర్షాతిరేకాలు



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, మదన్‌రెడ్డి, మాణిక్‌రావు, చిత్రంలో మంత్రి హరీశ్‌రావు తదితరులు

మెదక్: రూ.లక్ష రుణమాఫీపై రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే రెండు విడతల్లో రూ. 50వేల లోపు రుణాన్ని మాఫీ చేసింది. మరో రూ.50 వేల రుణాలు మాఫీ కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 5 లక్షల ఎకరాల సాగు భూములు ఉండగా 48,682 మంది రైతులు 3 లక్షల పైచిలుకు ఎకరాలు సాగు చేస్తున్నారు. ఇందుకోసం రూ.274.54 కోట్ల పంట రుణాలను వివిధ బ్యాంకుల్లో 2018 డిసెంబర్‌కు ముందు అప్పుతీసుకున్నారు. ఇందులో మొదటి విడతగా 2020 మే నెలలో 11,411 మంది రైతులకు సంబంధించి రూ.18.23 కోట్లు మాఫీ చేసింది. అలాగే 2021 ఆగస్టులో 11,953 మంది రైతులకు చెందిన రూ. 50 వేల లోపు రుణాలను రూ. 38.47 కోట్లు మాఫీ చేశారు. అంటే రెండు విడతల్లో 23,364 మంది రైతులకు మొత్తం రూ.56.70 కోట్లు మాఫీ అయ్యాయి.

నాలుగేళ్లుగా నిరీక్షణ

ఈ లెక్కన రూ.లక్ష వరకు 25,318 మంది రైతులకు సంబంధించి ఇంకా రూ. 217.84 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. రుణమాఫీ కోసం ప్రతిఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నా మాఫీ మాత్రం కాలేదు. నాలుగేళ్లుగా రుణమాఫీ కోసం రైతాంగం కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురు చూడగా.. ఇప్పటికి రుణమాఫీ చేస్తా మని ప్రభుత్వం పేర్కొనడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రెండింతలైన రుణాలు

బీఆర్‌ఎస్ రెండోసారి 2018లో ఎన్నికల ప్రచారంలో భాగంగా రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. 70 శాతం మంది రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను రెన్యూవల్ చేయలేదు. దీంతో తీసుకున్న అప్పులకు వడ్డీకి చక్రవడ్డీతో రెండింతలైనట్లు బ్యాంకు అధికారులు చెబుతున్నారు. చాలామంది బ్యాంకులకు వెళ్లడమే మానేశారు. ఇందులో భాగంగా రైతులకు సంబంధించిన పింఛన్, రైతుబంధు, ధాన్యం డబ్బులు బ్యాంకర్లు ఆపేశారు. ఈ విషయాన్ని మంత్రి హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన గతంలో మెదక్ వచ్చిన సందర్భంగా పింఛన్, రైతుబంధు డబ్బులు పట్టుకోవద్దని బ్యాంకర్లను ఆదేశించారు. 2018 డిసెంబర్ 11 నాటికంటే ముందు తీసుకున్న అప్పుల్లో రూ.లక్ష వరకు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రూ.లక్ష కంటే ఎక్కువ ఉంటే అవి రైతులే చెల్లించాలా? లేదా అనే విషయంపై నిబంధనలు రావాల్సి ఉందని బ్యాంకర్లు చెబుతున్నాయి.

అడ్డదారులు తొక్కి ఆరిపోయావా బిడ్డా!

- కొడుకు బలవన్మరణంతో తల్లడిల్లిన తల్లిదండ్రులు
- ఉన్నత చదువులకెళ్లి.. బెట్టింగ్ వ్యసనాలకు అలవాటు పడి..
- అప్పుల బాధలు భరించలేక గిరిజన విద్యార్థి ఆత్మహత్య

పాపన్నపేట (మెదక్): ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయిలో ఉంటావనుకుంటే.. అడ్డదారులు తొక్కి, అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్నాడో గిరిపుత్రుడు. కన్నవారికి తీరని వేదన మిగిల్చి కానరాని లోకాలకు తరలివెళ్లాడు. ఈ సంఘటన పాపన్నపేట మండలం పొడిచన్‌పల్లి తండాలో బుధవారం రాత్రి వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన పాల్య మోహన్, బుజ్జి దంపతులకు మురళి (19), అస్మిత సంతానం. అర ఎకరం పొలంలో రెక్కలు ముక్కలు చేసుకొని బిడ్డలను ఉన్నత చదువులు చదివించాలని తల్లిదండ్రులు కలలుగన్నారు. హత్నూర రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ చదివిన మురళి.. మంచి ఫలితాలు సాధించాడు. దీంతో బిడ్డ భవిష్యత్‌పై ఆశలు పెంచుకున్న తల్లిదండ్రులు అర ఎకరం పొలాన్ని తనఖా పెట్టి, ఢిల్లీలోని సంస్కృతి యూనివర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో చేర్పించారు.



మురళి (ఫైల్)

చెడు అలవాట్లు

గిరిజన గూడెం నుంచి దేశ రాజధానిలోకి అడుగు పెట్టిన మురళి.. కొత్త ప్రపంచంలో చెడు అలవాట్లకు లోనయ్యాడు. దోస్తుల మోజులో బెట్టింగ్‌లు, మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. ఐపీఎల్ బెట్టింగ్‌లో సుమారు రూ.5 లక్షల అప్పులు చేశాడని తెలుస్తుంది. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో గత నెల 24న ఇంటికి వచ్చాడు. అతని వ్యవహార శైలిపై అనుమానం వచ్చిన తల్లిదండ్రులు ఆరా తీయగా.. అసలు విషయం బయట పడింది. ఉన్న అర ఎకరం పొలం అమ్మేసి రుణం తీర్చేద్దామని, భయపడొద్దని కన్నవారు ఓదార్చారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం బైక్‌పై బయటకు వెళ్లిన మురళి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. ఏడుపాయల రోడ్డు మార్గంలోని అడవిలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పశువుల కాపరులు ఇచ్చిన సమాచారం మేరకు, బుధవారం రాత్రి తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి వెళ్లి.. విగతజీవిగా కనిపించిన కొడుకును చూసి తల్లడిల్లిపోయారు. పాపన్నపేట ఎస్సై మహిపాల్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

16 మద్యం షాపుల కేటాయింపు

- లాటరీ పద్ధతిన ఎస్టీ –1, ఎస్సీ– 6, గౌడకులస్తులకు 9
- కలెక్టర్ రాజర్షిషా ఆధ్వర్యంలో డ్రా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో మొత్తంగా 49 మద్యం దుకాణాలుండగా లాటరీ పద్ధతిలో పదహారింటిని (ఎస్సీ–6, ఎస్టీ–1, గౌడకులస్తులకు 6) కేటాయించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి శంకర్, ఎస్సీ,ఎస్టీ అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎండీ రజాక్ పాల్గొన్నారు. జిల్లా ఎక్సైజ్ సీఐ నాగేశ్వర్‌రావు, డీటీఎఫ్ నరెందర్, సీఐ, ఎస్‌ఐలు నగేష్ తదితరులు పాల్గొన్నారు

కేటాయింపు ఇలా..

పొడ్చన్‌పల్లి –1(ఎస్టీ), మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని షాపునం.5 (ఎస్సీ), టేక్మాల్ (ఎస్సీ), పోతంశెట్టిపల్లి (ఎస్సీ), నర్సాపూర్ మున్సిపాలిటీ షాపునెం.4(ఎస్సీ), జగ్గంపేట(ఎస్సీ), రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని షాపునెం.1(ఎస్సీ), మంభోజిపల్లి 1, రంగంపేట 1, తూప్రాన్ మున్సిపాలిటీ షాపునెం.2, నర్సాపూర్ మున్సిపాలిటీ షాపునెం.1, 2, కాళ్లకల్ షాపునెం.2, రామాయంపేట మున్సిపాలిటీ షాపునం.2, వెల్దుర్తిలో షాపునెం.2, వడియారం దుకాణాలను గౌడకులస్తులకు కేటాయించారు.

వ్యవసాయేతర భూముల క్రమబద్ధీకరణ

జిల్లాలో నోటరీ ద్వారా కొనుగోలు చేసిన వ్యవసాయేతర భూములను రిజిస్ట్రేషన్ ద్వారా క్రమబద్ధీకరించుకోవాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రమేశ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసిందని.. సమీపంలో ఉన్న మీసేవ సెంటర్ల ద్వారా దరఖాస్తులు సమర్పించాలన్నారు. వ్యవసాయేతర భూమి 125 గజాలలోపు నిర్మించిన కట్టడాలకు స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాపురం చేయడం లేదని కక్షగట్టి..

- అక్క, భర్తను మట్టుబెట్టించిన భార్య
- రూ.50 వేలు సుపారీ.. ఇద్దరు నిందితుల అరెస్టు
- వీడిన జంటహత్య కేసుల మిస్టరీ

హత్నూర (సంగారెడ్డి): తనతో సరిగా సంసారం చేయడం లేదని కక్షగట్టిన మొదటి భార్య పథకం ప్రకారం భర్తను, సొంత అక్కను హత్య చేయించింది. సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులకు అడ్డంగా దొరికిపోవడంతో జంట హత్యల కేసు మిస్టరీ వీడింది. ఈ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలో డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీఐ వేణుకుమార్ కేసు వివరాలను మీడియాకు వివరించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డిగూడెం తండాకు చెందిన ధనావత్ పీఖ్యకు భాష (25), బేబీ (23) కూతుర్లు ఉన్నారు. వారికి వివాహాలు కూడా చేశారు. చిన్న కూతురు బేబీ, భర్త లక్ష్మణ్ కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కాగా, కొన్నేళ్ల క్రితం పెద్ద కూతురు భాష భర్తతో గొడవపడి విడిపోయి పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో చెల్లెలి భర్త లక్ష్మణ్‌తో సన్నిహితంగా ఉంటూ రెండో పెళ్లి చేసుకుంది. ఈ క్రమంలోనే తనతో కాపురం సక్రమంగా చేయడం లేదని కక్షగట్టిన మొదటి భార్య బేబీ.. భర్త లక్ష్మణ్‌తో పాటు అక్కపై కక్ష పెంచుకుంది. దీంతో వారిద్దరిని హత్య చేయించేందుకు పథకం వేసింది.

జూన్ 17న అదృశ్యం..

లక్ష్మణ్, భాష జూన్ 17న కూలి పనుల కోసం ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమయ్యారు. అదే నెల 24న హత్నూర మండలం రొయ్యపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మహిళ మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. మృతురాలి చేతిపై ఉన్న పచ్చబొట్టు ఆధారంగా ఆమె ఆచూకీని గుర్తించారు. అయితే.. ఈ ఘటన జరిగినప్పటి నుంచి కనిపించకుండా పోయిన భర్త లక్ష్మణ్ హత్య చేసి ఉంటాడని అనుమానించిన పోలీసులు.. అతని ఆచూకీ కోసం దర్యాప్తు ముమ్మరం చేశారు. కానీ దర్యాప్తు కొనసాగిస్తున్న క్రమంలో కొత్తకోణం వెలుగుచూసింది.



జంట హత్య కేసు వివరాలను వివరిస్తున్న డీఎస్పీ పురుషోత్తం రెడ్డి

కక్ష గట్టి.. సుపారీ ఇచ్చి..

భర్త లక్ష్మణ్ తనతో సరిగా సంసారం చేయడం లేదని బేబీ కక్ష పెంచుకుంది. ఎలాగైనా లక్ష్మణ్‌తో పాటు అక్క భాషను హత్య చేయించాలని నిర్ణయించుకుంది. అదే తండాకు చెందిన వరుసకు అన్న అయ్యే బానోత్ వినోద్‌తో రూ.50 వేలకు సుపారీ కుదుర్చుకుంది. ఐదు వేలు అడ్వాన్స్‌గా ఇచ్చింది. మాయమాటలు చెప్పి లక్ష్మణ్, భాషను పనికోసమని చెప్పి వినోద్ వద్దకు పంపించింది. తర్వాత ముగ్గురూ కలిసి హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లి అటవీ ప్రాంతంలోని పలుగుమీది నల్ల పోచమ్మ ఆలయం వద్ద మద్యం సేవించి అక్కడి నుంచి రొయ్యపల్లి అటవీ ప్రాంతానికి వెళ్లారు. చీకటి పడుతున్న సమయంలో లక్ష్మణ్ తలపైన వినోద్ బండరాయితో కొట్టి దారుణంగా హత్య చేశాడు. అడ్డుకోబోయిన భాషను కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. ఆమె ఒంటిపై బంగారు, వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్‌తో పాటు నగదుతో పారిపోయాడు.

కాగా, తనకు అప్పుల బాధ ఎక్కువైందని, తన భార్య సొమ్ములను కుదువ పెట్టాలని, ఇందుకు సాయం చేయాలని సాగిరెడ్డిపల్లికి చెందిన స్నేహితుడు నరేశ్‌కు వినోద్ ఫోన్ చేశాడు. ఇద్దరు కలిసి శివ్వంపేట మండలం గోమారంలోని ఓ దుకాణంలో రూ.1.50 లక్షలు తనఖా పెట్టారు. మరోవైపు పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో లక్ష్మణ్ ఫోన్ నుంచి ఎవరెవరికి కాల్స్ వెళ్లాయని ఆరా తీయగా.. అందులో వినోద్ పేరు బయటకు వచ్చింది. అతడిని అదుపులోకి విచారించగా.. అసలు విషయం బయటపడింది. భార్యాభర్తలను తానే హత్య చేశానని వినోద్ అంగీకరించాడు. లక్ష్మణ్ కోసం గాలిస్తున్న క్రమంలో అతను కూడా హత్యకు గురయ్యాడని తెలిసి పోలీసులు షాక్‌కు గురయ్యారు. లక్ష్మణ్ అస్థి పంజరానికి పోస్టుమార్టం నిర్వహించారు. జంట హత్యలకు సూత్రధారులైన ధనావత్ బేబీ, వినోద్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన జిన్నారం సీఐ వేణు కుమార్, ఎస్సైలు లక్ష్మారెడ్డి విజయరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. ఎస్పీ సైతం అభినందిస్తూ పారితోషికాన్ని ప్రకటించారని డీఎస్పీ పురుషోత్తంరెడ్డి తెలిపారు.

సామర్థ్యాల పెంపునకు తొలిమెట్టు



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

జిల్లా విద్యాధికారి రాధాకిషన్

టేక్మాల్(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సామర్థ్యాల పెంపునకే తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. తొలిమెట్టు శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రమైన టేక్మాల్ ఉన్నత పాఠశాలలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు తెలుగు పాఠ్యాంశాల శిక్షణ కార్యక్రమాన్ని డీఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలిమెట్టులో అందించే శిక్షణ కార్యక్రమం బాగా తీసుకొని విద్యార్థులకు మెలకువలతో కూడి విద్యాను అందించాలని సూచించారు. విద్యార్థులకు మెలకువలతో కూడిన విద్యను అందించాలని పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని కోరారు. శిక్షణ తరగతులకు ఎవరు గైర్హాజరవకూడదని ఆదేశించారు. ఇందులో అకడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, నోడల్ అధికారి శివకుమార్, హెచ్‌ఎం ఆర్‌పీలు సంతోష్‌కుమార్, శ్రీనివాస్, కృష్ణ, నరేష్, సత్య తదితరులు ఉన్నారు.

పెద్ద శంకరంపేట(మెదక్): తొలిమెట్టు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడేలా విద్యాబోధన చేయాలని డీఈఓ రాధాకిషన్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం పెద్ద శంకరంపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు శిక్షణా శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం అందించిన మాడ్యూల్స్ ఆధారంగా బోధన చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంఈఓ బుచ్చ నాయక్, నోడల్ అధికారి విజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిని నరికి చంపిన తనయుడు

హవేళీఘనపూర్: కన్నతల్లిని కిరాతకంగా నరికిచంపాడు ఓ తనయుడు. ఈ సంఘటన తొగిటలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కుస్తి నర్సమ్మ(45) రెండో కుమారుడు భానుప్రసాద్ తల్లితో గొడవపడ్డాడు. మాటామాట పెరిగి, కోపోద్రిక్తుడై తల్లిని కత్తితో కిరాతకంగా నరికి చంపాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తల్లిని ఎందుకు చంపాడన్న విషయంపై పోలీసులు విచారిస్తున్నారు.

క్షణికావేశం.. తీసింది ప్రాణం

- గుండంలో దూకిన దంపతులు
- భార్య మృతి, భర్త పరిస్థితి విషమం

హవేళీఘనపూర్: భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణ ఒకరిని బలి తీసుకుంది. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన దేవునికూచన్‌పల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మెదక్ పట్టణానికి చెందిన మక్కా యాదగిరి, భార్య లావణ్య(24) దంపతులు కూచన్‌పల్లి లోని తమ బంధువుల ఇంట్లో విందుకు హాజర య్యారు. అక్కడ ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహావేశానికి గురైన యాదగిరి, భార్య లావణ్య, మరదలు స్వప్న పక్కనే ఉన్న గుండంలో దూకారు. దీంతో లావణ్య మృతి చెందింది. కుటుంబీకులు వెంటనే వారిని బయటకు తీసి మెదక్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్వప్న ప్రాణాలతో బయటపడగా, యాదగిరి పరిస్థితి విషమంగా ఉంది. హవేళీఘనపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



లావణ్య.



చికిత్స పొందుతున్న యాదగిరి

లింగోచి ఆటకు జాతీయ స్థాయిలో గుర్తింపు



నర్సాపూర్: లింగోచి ఆటకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని తెలంగాణ రాష్ట్ర లగోరి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ చెప్పారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. తాము 13ఏళ్ల క్రితం అసోసియేషన్ ఏర్పాటు చేసి లింగోచి ఆటను విద్యార్థులకు నేర్పించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు. కాగా మెదక్ జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు లింగోచి ఆట ఆడేందుకు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కాగా తమ అసోసియేషన్‌కు రాష్ట్రంలో జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని అందులో భాగంగా మెదక్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా రాజేష్‌ను నియమించినట్లు నవీన్ చెప్పారు.

మార్కెట్ పదవికి పోటాపోటీ

పెరిగిన ఆశావహులు

నర్సాపూర్: నర్సాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి అధికార పార్టీలో పోటీ నెలకొంది. గతంలో మహిళకు చైర్మన్ పదవి ఉండగా.. ఇటీవల ప్రభుత్వం బీసీ జనరల్‌కు కేటాయించింది. దీంతో ఆశావహుల సంఖ్య పెరిగింది. స్థానిక మార్కెట్ కమిటీ పాలకవర్గంలో 18 మంది సభ్యులుగా ఉంటారు. వారిలో 14 మందిని ప్రభుత్వం సభ్యులుగా నామినేట్ చేస్తుంది. వారితో పాటు మున్సిపల్ చైర్మన్, మార్కెట్ కమిటీ పరిధిలోని ఒక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, స్థానిక ఏడీఏలు సభ్యులుగా కొనసాగే అవకాశం ఉంటుంది. మార్కెట్ కమిటీ పరిధిలో నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ మండలంతో పాటు శివ్వంపేట, కౌడిపల్లి, చిలిపిచెడ్, హత్నూర మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల పరిధిలోని వ్యక్తులను కమిటీ చైర్మన్‌తో పాటు సభ్యులుగా నియమించే అవకాశం ఉంటుంది. అయితే నర్సాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి గతంలో మహిళకు కేటాయించగా ఇటీవల ప్రభుత్వం బీసీ జనరల్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అధికార బీఆర్‌ఎస్‌లోని పలువురు బీసీ నాయకులు చైర్మన్ పదవికి పోటీ పడుతున్నారు. నర్సాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షురాలు అనుసూయ భర్త, నర్సాపూర్ ఒకటో వార్డు కౌన్సిలర్ అశోక్‌గౌడ్, నర్సాపూర్ మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు మాధవి భర్త జగదీశ్వర్, నర్సాపూర్ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ శివకుమార్ చైర్మన్ పదవి కోసం పోటీ పడుతున్నారు. ఎవరికి వారు తమ సామాజిక వర్గం నాయకులను, పార్టీలోని తమకు అనుకూలంగా ఉండే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇతర నాయకులను తీసుకుని మంత్రి హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డిని కలిసి తమకే చైర్మన్ పదవి ఇవ్వాలని కోరుతున్నారు. ఏ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి చైర్మన్ పదవి ఇచ్చినా ఇతర సామాజిక వర్గాల నాయకులతో పాటు వారి అనుచరులతో రాబోయే ఎన్నికల్లో ఇబ్బంది తలెత్తే అవకాశాలు ఉంటాయని పార్టీ పెద్దలు ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తుండడంతో చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.



వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఉద్యమ జాగరణ కరపత్రం ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

చేగుంట(తూప్రాన్): ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ అన్నారు. చేగుంట ఉన్నత పాఠశాలలో తపస్ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా కార్యదర్శి మాధవి, మండలాధ్యక్షులు వేంకటేశ్, చందన, తిరుపతి, అమరేశ్వరీ, చిన్మయి, జోత్స్నరేఖ, భాగ్య, సిద్ధిరాములు, శంకర్‌సింగ్, రాధ, సౌజన్య, సరస్వతీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధర్మాసాగర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్

60 ఇళ్లలో సోదాలు, 45 బైక్‌లు సీజ్



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్‌ఐ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ధర్మాసాగర్‌లో గురువారం పోలీసులు కార్డన్ సెర్చ్‌లో 45 వాహనాలు సీజ్ చేశారు. నర్సాపూర్ సీఐ షేక్ లాలమదర్, కౌడిపల్లి ఎస్‌ఐ శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆదేశాల మేరకు కమ్యూనిటీ కనెక్టివిటీ ప్రోగ్రాంలో భాగంగా తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 60 ఇళ్లలో సోదాలు నిర్వహించగా సరైన ధ్రువపత్రాలు లేని 45 బైక్‌లు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపవద్దన్నారు. అతివేగం ప్రమాదమని చెప్పారు. రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు విఠల్, శ్రీనివాస్ పోలీసులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్



చెక్కు అందిస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి మున్సిపాలిటీ : పేద, మధ్య తరగతి ప్రజలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో 20 మంది లబ్ధిదారులకు రూ.6 ,82,500ల చెక్కుల గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు తీసుకు వచ్చిందన్నారు. సీఎం కేసీఆర్ పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే కోట్లాది రూపాయలు సీఎం సహాయ నిధి ద్వారా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కొండాపూర్ మండల అధ్యక్షుడు విఠల్, కొండాపూర్ వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధురాలి మృతి

పటాన్‌చెరుటౌన్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ సంఘటన అమీన్‌పూర్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ శ్రీహరి కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండలం వడక్‌పల్లికి చెందిన శ్యామలమ్మ(62) కొంతకాలంగా మానసిక స్థితి సరిగాలేదు. ఆపై ఫిట్స్‌తో బాధపడుతుండేది. గురువారం ఉదయం 7.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లి శ్యామలమ్మ గ్రామ సమీపంలో ఉన్న నల్లచెరువు వద్దకు నడుచుకుంటూ వెళ్తూ ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉసురుతీసిన కుటుంబ కలహాలు

- ఉరేసుకొని భార్య, రైలు కిందపడి భర్త ఆత్మహత్య
- మాసాయిపేటలో ఘటన



హేమలత



మహేశ్

చేగుంట (తూప్రాన్): కుటుంబ కలహాలు భార్యాభర్తలను బలితీసుకుంది. గంటల వ్యవధిలోనే ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన మెదక్‌జిల్లా తూప్రాన్ మండలం మాసాయిపేటలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన కాశబోయిన మహేశ్(36), హేమలతకు(28) దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. మహేశ్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా మహేశ్ మద్యానికి బానిసై ఇంట్లో తరచూ గొడవపడేవాడు. రెండు రోజులు క్రితం ఇద్దరి మధ్య మళ్లీ ఘర్షణ పడగా.. ఆమె మాసాయిపేటకు వచ్చింది. ఈ క్రమంలో గురువారం కూడా ఇద్దరి మధ్య గొడవ జరగడంతో తీవ్ర మనస్తాపం చెందిన హేమలత.. ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలిసిన మహేశ్.. తన సోదరుడు నవీన్‌కు కాల్ చేసి తాను రైలుకింద పడి చనిపోతున్నానని చెప్పాడు. వెంటనే అతను తన తండ్రి దర్శన్‌కు చెప్పగా, శ్రీనివాస్ నగర్ రైల్వేస్టేషన్‌కు చేరుకోగా అప్పటికే రైలు కిందపడి మహేశ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేగుంట ఎస్‌ఐ హరీశ్ ,కామారెడ్డి రైల్వే ఎస్‌ఐ తావూనాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యవంతులతోనే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధిలో పయనిస్తోందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ×గడా౯ ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డితో కలిసి విద్యార్థులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు కళాశాలల్లో విద్యార్థులకు నట్టల నివారణ మందులు అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు నులిపురుగు నివారణ మందులు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఎంపీపీ దాసరి అమరావతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, శ్రీగిరిపల్లి పీహెచ్‌సీ డాక్టర్ రాహుల్‌కుమార్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై దృష్టిసారించాలి



అంబాజిపేటలో పండ్ల తోటల పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

- జెడ్పీ సీఈఓ శైలేష్‌కుమార్

చిన్నశంకరంపేట(మెదక్): పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని జెడ్పీ సీఈఓ శైలేష్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని గజగట్లపల్లి గ్రామపంచాయతీని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో పరిసరాలు పరిశీలించారు. ఆపై రికార్డులనూ తనిఖీలు చేశారు. గ్రామంలో ఎలాంటి ఆరోగ్య సమస్యలూ తలెత్తకుండా అవసరమైన పరిసరాలు శుభ్రం చేయాలని సర్పంచ్ మీనారవిందర్‌కు, గ్రామ కార్యదర్శి సంతోష్‌కు సూచించారు. అనంతరం మండలంలోని అంబాజీపేటలో పండ్ల తోటల పెంపకం పనులు పరిశీలించి, ఈజీఎస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

కార్యదర్శుల క్రమబద్ధీకరణ బాధ్యత మాదే

- ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్



మాట్లాడుతున్న మహేష్

నారాయణఖేడ్: ప్రతి జూనియర్ పంచాయతీ కార్యదర్శి క్రమబద్ధీకరణ బాధ్యతను టీఎన్జీవోస్, పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్‌ఫోరం తీసుకుంటోందని ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ తెలిపారు. నారాయణఖేడ్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉన్న సమస్యలను కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. క్రీడల కోటా కింద నియమితులైన ఉద్యోగాల నుంచి తొలగించబడ్డ 98 మంది కార్యదర్శుల పునర్ నియామకానికి సంఘం కృషి చేస్తోందని అన్నారు. పొరుగుసేవల కింద పని చేస్తున్న 1,100 మందిని జేపీఎస్‌లుగా కన్వర్ట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, టీఎన్జీవోస్ ఖేడ్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద శ్రీనివాస్, మహ్మద్ మిస్కిన్, ప్రతినిధులు నారాయణ, బాలమణి, అరవింద్ పాల్గొన్నారు.

‘గురుకులం’లో వైద్య బృందం

- కండ్ల కలకతో బాధపడుతున్న విద్యార్థులకు సూచనలు



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న వైద్యులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు సందర్శించారు. పాఠశాలలో కొంతమంది విద్యార్థులు కండ్ల కలకతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న వైద్యుల బృందం గురువారం పాఠశాలను సందర్శించి తాజా పరిస్థితిపై ఆరా తీసింది. నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇతరులకు సోకకుండా ఉండేలా సూచనలు చేశారు. తీవ్రత ఎక్కువగా ఉన్న వారిని గుర్తించి వారిని ఐసోలేషన్‌లో ఉండాల్సిందిగా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో కండ్ల కలక అనేది ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతోందన్నారు. అనంతరం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. వారి వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్ : గుర్తుతెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన బీడీఎల్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం... మండలంలోని పాటీ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 448లో చిపోలమడుగు(కొల్లూరు - వెలిమెల నుంచి వచ్చే కాలువ) కాలువలో గురువారం గుర్తుతెలియని మహిళ(35) మృతదేహం గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అప్పటికే కుళ్లిపోగా.. మృతి చెంది 10 నుంచి 12 రోజులై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి కుడికాలికి పట్టి, గులాబీ కలర్ పాయింట్ ధరించి ఉందని తెలిపారు. ఆ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అథ్లెటిక్స్‌లో గురుకులం విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో గురుకులం ప్రిన్సిపాల్ ఇతర సిబ్బంది

నర్సాపూర్: తమ గురుకులం విద్యార్థులు అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబర్చినారని స్థానిక అల్లూరి సీతరామరాజు గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ భిక్షమయ్య తెలిపారు. బుధవారం మెదక్‌లో జరిగిన పోటీలలో తమ విద్యార్థులు పాల్గొన్నారని వారిలో కొందరు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని చెప్పారు. వంద మీటర్ల పరుగు పందెంలో 14 ఏళ్ల కేటగిరిలో బాలు జిల్లా స్థాయిలో మొదటి బహుమతి పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడన్నారు. 16 ఏళ్ల కేటగిరిలో వంద మీటర్ల పరుగు పందెంలో అశోక్, 18ఏళ్ల కేటగిరిలో జావెలిన్ త్రో పోటీలో శివ ప్రథమ స్థానంలో నిలిచాడని, 18 ఏళ్ల కేటగిరిలో వంద, నాలుగు వందల మీటర్ల పరుగు పందెంలో అర్జున్, కృష్ణలు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని భిక్షమయ్య వివరించారు.

రోడ్డు దాటుతుండగా ప్రమాదం

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



శ్రీకాంత్ ఆడవార్

పటాన్‌టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. ఒడిశాకు చెందిన శ్రీకాంత్ ఆడవార్(42) బుధవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లాడు. గురువారం తెల్లవారుజాము 1.30 సమయంలో నడుచుకుంటూ ముత్తంగి రింగ్ రోడ్ సమీపంలో సిల్వర్ బావర్చి ఎదురుగా రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అక్కడికక్కడ మృతిచెందాడు. మృతుడి భార్య మనీని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మద్యంమత్తులో వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్ టౌన్: మద్యంమత్తులో అనేగుంటకు చెందిన రాజగారి అశోక్(33)ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతను కూలీ పనిచేసుకునేవాడు. తాగుడుకు బానిసై అప్పులు చేశాడు. ఈ బాధతో మద్యంమత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య కవిత పనికి వెళ్లి ఇంటికి వచ్చేసరికి అతడు విగతజీవిగా కనిపించాడు.

గౌరారంలో యువకుడు ...

వర్గల్(గజ్వేల్): మద్యానికి బానిసై, జీవితంపై విరక్తితో గౌరారంలో వెల్దుర్తి ఉదయ్(31)ఆత్మహత్య చేసుకున్నాడు. 6 నెలల నుంచి అతను మద్యానికి బానిసయ్యాడు. బుధవారం మధ్యాహ్నం సెలూన్‌షాపునకు వెళ్లి రాత్రయినా రాలేదు. భార్య శ్వేత పాత ఇంటికి వెళ్లి చూడగా ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు.

ఆర్థిక ఇబ్బందులతో ..



గణేష్‌గౌడ్

శివ్వంపేట(నర్సాపూర్): ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లింగోజిగూడలోచెందిన గణేష్‌గౌడ్(45) వ్యవసాయంతో చేసుకుంటూనే పెయిటింగ్ పని చేసుకునేవాడు. పిల్లల ఉన్నత చదువులకు ఫీజులు, అనారోగ్య సమస్యలు తలెత్తడంతో జీవితంపై విరక్తి చెందాడు. బుధవారం సాయంత్రం పొలంలో పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స కోసం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యానికి కొంపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజాము మృతిచెందాడు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఝరాసంగం(జహీరాబాద్): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల తెలిపిన ప్రకారం.. కుప్పానగర్‌కు చెందిన మర్పల్లి నాగన్న(36) కొన్నేళ్లుగా గ్రామ శివారులోని నసీబ్ స్టోన్ కంకర్ మిషన్ వద్ద ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తుండేవాడు. ఈ క్రమంలో గురువారం క్రషర్ వద్ద విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా షాక్ తగిలి మృతిచెందాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఈసారి రేగోడ్‌కు ప్రాధాన్యం

- జిల్లా విద్యాధికారి రాధాకిషన్



రేగోడ్: మాట్లాడుతున్న డీఈఓ

రేగోడ్(మెదక్): డీఎస్సీ అనంతరం రేగోడ్ మండలంలోని ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల భర్తీకి మొదటిగా ప్రాధాన్యత ఇస్తామని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను గురువారం సందర్శించారు. ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తొలిమెట్టు శిక్షణ కార్యక్రమాన్ని, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు. ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులకు రాగిజావ అందజేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడారు. అక్కడ ఖాళీలు చూసి తనకే బాధేస్తోందని, పనిచేస్తున్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌లపై పంపించేదీ లేదని చెప్పారు. ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు సక్రమంగా పని చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల కొరత ఉన్నా అధిగమించి విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన బోధన అందించాలన్నారు. విద్యార్థులకు పౌష్టిక ఆహారలోపాన్ని అధిగమించడానికి రాగిజావ ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. . డీఈఓ వెంట ఎంఈఓ బుచ్చా నాయక్, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి ఉన్నారు.

అల్లాదుర్గం(మెదక్): ఉపాధ్యాయులు మనస్సు పెట్టి పాఠశాలకు వెళ్లి, లక్ష్యంతో బోధిస్తే మెరుగైన విద్య అందుతోందని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. గురువారం అల్లాదుర్గం జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న తొలిమెట్టు శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెప్పిన పాఠాలు విని విద్యార్థులు సమాధానాలు చెబితే , వచ్చే సంతోషం వెలకట్టలేనిదన్నారు. శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధన చేస్తే ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధించవచ్చు అన్నారు. ప్రభుత్వం మెరుగైన విద్యనందించేందుకే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తే విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలు పొందొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చానాయక్, హెచ్‌ఎంలు ధనుంజయ్య, జనార్ధన్, రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణమాఫీ వడ్డీకే సరిపోదు

- డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి

పాపన్నపేట(మెదక్): సీఎం ప్రకటించిన రుణమాఫీ రైతు చెల్లించిన వడ్డీకి సరిపోదని డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం ఆయన, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డితో కలిసి పాపన్నపేటలో కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అంతకు ముందు గాంధారిపల్లిలో గడపగడపకు కాంగ్రెస్‌లో భాగంగా పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఎండుగుల భూలక్ష్మి, విఠల్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో రుణమాఫీ చేస్తానని సీఎం ప్రకటించారని, 5 ఏళ్ల తర్వాత ఎన్నికల వేళ ఇది ఓటు బ్యాంకు రాజకీయమేనన్నారు. ఈ 5 ఏళ్లలో రైతు తీసుకున్న రుణం వడ్డీతో కలిసి డబుల్ అయ్యిందన్నారు. వీఆర్‌ఏలను మరో డిపార్ట్ మెంట్‌లోకి పంపితే గ్రామాల్లో పాలన కుంటుపడుతోంన్నారు. మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ 10ఏళ్లలో టీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని నాశనం చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంతప్ప, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బామన్ చెరువుకు అలుగు నిర్మించాలి



వృథాగా పోతున్న నీరు

- మత్స్య శాఖ డైరెక్టర్ మహేష్

జిన్నారం(పటాన్‌చెరు): ఊట్లలోని బామన్‌చెరువుకు అలుగు లేకపోవటంతో నీరు వృథాగా పోతోందని, అలుగును నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ సుంకరబోయిన మహేష్ కోరారు. గురువారం అలుగును మత్స్యశాఖ డైరెక్టర్ మహేష్‌తో పటు మత్స్యకారులు సందర్శించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ బామన్ చెరువుకు అలుగు లేకపోవటంతో విలువైన నీరు వృథాగా పోతోందన్నారు. ఈ విషయమై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే అలుగు నిర్మించేలా ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

5 నుంచి వాలీబాల్ పోటీలు

- మహిళలకు త్రోబాల్ ..
- పోస్టర్ ఆవిష్కరించిన ఈషా ఫౌండేషన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ : ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ ఈషా ఫౌండేషన్ అధినేత సద్గురు ఆధ్వర్యంలో ఈశా గ్రామోత్సవంలో భాగంగా దక్షిణ భారతదేశంలో తెలంగాణలో మొట్టమొదటిసారిగా సంగారెడ్డి జిల్లాలో ఈనెల 5 నుంచి సెప్టెంబర్ 23వ తేదీ వరకు నిర్వహించనున్న వాలీబాల్ (పురుష) విభాగం త్రోబాల్ (మహిళల)కు పోటీలను జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ ప్రారంభిస్తారు. 15 సంవత్సరాల పై వారు అర్హులని ఈశా సంస్థ సభ్యులు తెలిపారు. ఒకే గ్రామానికి చెందిన టీం ఉండాలని సూచించారు. తొలుత వాల్‌పోస్టర్‌ను చింత ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని వలంటీర్లు ప్రజలు అందరూ కలిసి ఈ క్రీడోత్సవం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, నర్సింలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రసహిత దత్త యజ్ఞం

ఝరాసంగం(జహీరాబాద్): బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో గురువారం పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహరాజ్, డా.సిద్దేశ్వర్‌స్వామి ఆధ్వర్యంలో రుద్రసహిత దత్త యజ్ఞం, హోమం, పూర్ణాహుతి తదితర పూజలు చేశారు. జ్యోతిర్లింగాల వద్ద స్వామికి అభిషేకం, కూంకుమార్చన, మహామంగళహారతి తదితర గావించారు. కార్యక్రమానికి ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి హాజరయ్యారు. వీరికి ఆశ్రమ మర్యాదలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు, హోమంలో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు అందించి, పూలమాల, శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందించారు. ఆర్డీఓ వెంకారెడ్డి, నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి పాల్గొన్నారు.

అందరికీ న్యాయం చేయండి

- కలెక్టరేట్ ఎదుట ఈసాదారుల నిరసన
- కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏ ఈసాదారులు

మెదక్ కలెక్టరేట్: వీఆర్‌ఏలలో అసలుదారులకు ఒక్కరికే రెగ్యులర్ చేయడంతో ఈసాదారులం రోడ్డు పడుతామని, అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ రాజర్షిషాను వీఆర్‌ఏలు కోరారు. కొల్చారం మండలం ఎనగండ్ల, పాపన్నపేట, నిజాంపేట మండలం చల్మెడ గ్రామాలకు చెందిన వీఆర్‌ఏలు(నీరుడిలు, మస్కూరిలు) గురువారం కలెక్టరేట్ వద్దకు తరలివచ్చి తమకు న్యాయం చేయాలని నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈసాదారులు మాట్లాడుతూ, వీఆర్‌ఏలు అనేది గ్రామాల్లో ఉమ్మడి హక్కు అని, ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో ఈసాదారులు ఉంటారన్నారు. సీఎం కేసీఆర్ కేవలం అందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కొల్చారం మండలం ఎనగండ్లకు చెందిన మానయ్య, సామయ్య, రాజు, దాసు, నర్సింలు, భూమయ్య, పాపన్నపేటకు చెందిన సామెల్ పాల్గొన్నారు.